"గురువర్యా! మోక్షానికి కావలసింది కర్మా? లేక జ్ఞానమా? ముముక్షువులకి ఏది మంచిది?"

"నాయనా! పక్షి ఆకాశంలో ఎగరడానికి రెండు రెక్కలు ఎలా అవసరమో అలాగే ముముక్షువుకి కర్మ, జ్ఞానం అనే రెండూ అవసరం. నిష్కామ కర్మ అనే ఒక రెక్క వల్ల చిత్త శుద్ధి కలిగితే, జ్ఞానం అనే ఇంకో రెక్క వల్ల అవిద్యా నివృత్తి కలుగుతుంది. ఈ రెండూ మోక్షానికి అవసరం.

"ఇంకో వుదాహరణ కూడా చెప్తా విను. నీ ముఖం అద్దంలో చూసుకోవాలనుకుంటే అద్దం మీద పేరుకున్న దుమ్ముని దులపాలి. అంతేకాక నీ మొహం మీద వెలుగు కూడా పడాలి. అప్పుడే నీ ప్రతిబింబం అద్దంలో కనబడుతుంది. అలాగే చిత్తమనే అద్దం మీది స్వార్థమనే దుమ్ము దులపడానికి నిష్కామ కర్మ, జీవాత్మ అనే నీ మీద వెలుగు పడడానికి జ్ఞానం అవసరం అవుతాయి." జవాబు చెప్పాడు అగస్త్య మహర్షి.

## 46. హెచ్చు తగ్గులు

ఆంధ్ర రాష్ట్రానికి గవర్నర్‌గా వున్న ఒకతను బాలాజీ భక్తుడు. ఏడాదిలో కనీసం పదిసార్లు తిరుమలకి వెళ్ళేవాడాయన. ఆయన మరణించాక స్వర్గానికి వెళ్ళాడు. ఆయనకి తక్కువ పుణ్యం చేసిన వాళ్ళకి కేటాయించే ఇల్లు ఇచ్చారు. ఎక్కువ పుణ్యం చేసిన వాళ్ళతో మాట్లాడాక ఆయనకో విషయం అర్థమైంది. వాళ్ళంతా తన కన్నా తక్కువ సార్లు తిరుమలకి వెళ్ళారు.

వెంటనే ఆయన పుణ్యాత్ముల విషయాలని చూసే అధికారి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"నేను తిరుమలకి వెళ్ళినన్ని సార్లు కూడా ఇక్కడ ఎక్కువ పుణ్యం సంపాదించారని చెప్పబడే వాళ్ళల్లో ఎవరూ తిరుమలకి వెళ్ళలేదు. మరి నన్ను వాళ్ళతో సమానంగా ఎందుకు చూడటంలేదు?"

అందుకతను నవ్వి జవాబు చెప్పాడు.

"వాళ్ళంతా ధర్మదర్శనం క్యూలో ఇరవై గంటలకి పైగా నిలబడి వెళ్ళారు. కుంభాభిషేకంతో ఆలయ పూజారులు ఎదురు వచ్చి ఆహ్వానించగా, ఎలాంటి శ్రమపడకుండా నువ్వు సర్వ ఆలయ లాంఛనాలతో వెళ్ళి దర్శించావు. వాళ్ళలా ధర్మ దర్శనంలో వెళ్ళాల్సి వస్తే అసలు నువ్వు నీ రాజ్‌భవన్ నించి కదిలేవాడివే కాదు. తేడా అక్కడ వచ్చింది."

## 47. మినప గింజ

ఇద్దరు తత్త్వవేత్తలు కురుక్షేత్రంలో గీతా పారాయణం చేస్తున్న వాళ్ళని చూస్తూ, 'వాడు కర్ర, వీడు బట్ట, వీడు మినప గింజ' అంటూ వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకోసాగారు. ఇది విన్న ఒకతను వాళ్ళని సమీపించి, భక్తిగా నమస్కరించి వాళ్ళ మాటలకి అర్థం చెప్పమని వినయంగా కోరాడు. వారు చిరునవ్వు నవ్వి తమ మాటల అర్థం ఇలా చెప్పారు.

"ఇక్కడ గీతా పారాయణం చేస్తున్నవారి ఆధ్యాత్మిక స్థాయి గురించి మేం మాట్లాడుకుంటున్నాము. నీళ్ళల్లో కర్రని వుంచితే అది నీటిలో కలవక వేరుగా ఉంటుంది. బట్టని నీటిలో ఉంచితే అది కొద్దిగా నీటిని పీల్చుకుంటుంది. అదే మినప గింజని నీటిలో ఉంచితే అది నీటిని అవసరమైనంత పీల్చుకుంటుంది.

గీతలో చెప్పింది ఆచరించనివారు నీటిలోని కర్ర లాంటివారు. గీత వేరుగా, వీరు వేరుగా వుంటారు. కొందరు తాము చదివింది కొద్దిగానైనా వంటపట్టించుకుని ఆచరిస్తారు. వీరు బట్టలాంటివారు. మరికొందరు తాము చదివింది గ్రహించి పరిపూర్ణంగా దాన్ని ఆచరిస్తారు. నీటిని పీల్చుకున్న మినప గింజ మొలకెత్తినట్లుగా ఇలాంటి వారిలో జ్ఞానం మొలకెత్తుతుంది. పది మణుగుల సద్గ్రంథ పఠనం కన్నా ఒక్క వీశ ఆచరణ ఆధ్యాత్మికంగా పైకి తీసుకువెళ్తుంది."